www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 జనవరి 2023

5

ఏలూరు



జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిపిఎం

ప్రజాశక్తి - గణపవరం

జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు సరైన మౌలిక సదుపాయాల్లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవన్నారు. కనీసం ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు పి.గోవిందు, ఎస్.సంజీవరావు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్




ప్రజాశక్తి - ఏలూరు

జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీని వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. జగనన్న భూ సర్వే, ధాన్యం కొనుగోలు, మనబడి నాడు-నేడు, మధ్యాహ్న భోజన పథకం, స్పందన దరఖాస్తుల పరిష్కారం, తదితర అంశాలపై బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న భూహక్కు, భూ సర్వే చేసిన భూములకు సంబంధించి 24 వేల భూ హక్కు పత్రాలు ముద్రించి పంపిణీకి నిర్దేశించగా, కేవలం 14 వేల భూ హక్కు పత్రాలు మాత్రమే అయ్యాయని, మిగిలిన పత్రాలను రెండు రోజుల్లో పంపిణీ చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూహక్కు పత్రాల వివరాలపై అభ్యంతరాలను పంపిణీ సమయంలోనే స్వీకరించి, వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన వారి విషయంలో చట్టరీత్యా వారసులకు వివరాలపై విచారణ చేసి మ్యుటేషన్ చేయాలన్నారు.

జగనన్న భూ సర్వే మూడు, నాలుగు విడతల్లో చేపట్టిన 88 గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే పనులు ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలన్నారు. భూ విస్తీర్ణం ఎక్కువగా ఉన్న గ్రామాలకు సంబంధించి సర్వే పనులకు అదనపు సర్వేయర్లు అవసరమైతే తహశీల్దార్లు సంబంధిత అధికారులకు తెలిపి, సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. భూ సర్వే రోజూ వారీ ప్రగతిని తహశీల్దార్లతో సమీక్షించాలన్నారు. జిల్లాలో ఇ-క్రాప్ బుకింగ్ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో ఇ-క్రాప్ బుకింగ్ పూర్తి కాలేదని, మండల వ్యవసాయాధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అంచనా వేసిన ధాన్యం కన్నా అదనంగా ధాన్యం సేకరణకు వస్తే, అందుకు గల కారణాలను సంబంధిత తహశీల్దార్లు వ్యక్తిగతంగా పరిశీలించి నిజంగా సేకరించగలిగే ధాన్యం అయితే సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తే చేసేలా మండల స్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్సుల్లో వచ్చిన ఫిర్యాదులను ప్రతీ 15 రోజులకు ఒకసారి పరిశీలించి వాటిపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ఎంఇఒలను కలెక్టర్ ఆదేశించారు. స్పందన కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిష్కార విధానాలపై తాను సమీక్షిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జిల్లాలోని ప్రతీ ఉద్యోగి ముఖ ఆధారిత హాజరును తప్పనిసరిగా వేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి పి.అరుణ్ బాబు, అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒ ఎవిఎస్‌ఎస్.మూర్తి, జలవనరుల శాఖ ఎస్ఇ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఏసుదాసు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలుకు ఆర్డినెన్స్ తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్, దళిత, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జెఎసి కన్వీనర్ చాగంటి సంజీవయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాబ్జీ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు ఎస్‌సి, ఎస్‌టిలకే వినియోగించాలని చట్టంలో స్పష్టంగా ఉన్నపపటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను ఇతర శాఖలకు మళ్లించడం బాధాకరమన్నారు. నవరత్నాలు పేరు చెప్పి ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు ఆపేసి సబ్‌ప్లాన్ నిధులు దారుమళ్లించి, ఎస్‌సి, ఎస్‌టిలకు ద్రోహం చేస్తుందన్నారు. దీనిపై శాసనమండలిలో ప్రస్తావిస్తానని, సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి ఆర్డినెన్స్ తీసుకొచ్చేలా కృషి చేస్తామని, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అందరూ ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 2013లో ఇప్పటివరకూ రూ.లక్షా18 వేల కోట్లు సబ్‌ప్లాన్ నిధులు కేటాయించగా 60 శాతం నిధులే ఖర్చుయిందని, మిగతా 40 శాతం ఇతరులకు ఖర్చుపెడుతున్నారని, ఆ నిధులు కూడా ఎస్‌సి, ఎస్‌టిలకు ఖర్చు పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌సి, ఎస్‌టిల పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. మాల మహాసేన నేత ఎ.రవికుమార్ మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌సి కార్పొరేషన్ నిధులు పూర్తిగా నిలిపివేశారన్నారు. న్యూ డెమోక్రసీ నాయకులు సారి రాజశేఖర్ మాట్లాడుతూ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, లాయర్ డానియల్ మాల మహాసేన రాష్ట్ర అధ్యక్షులు పాపదాసు రవికుమార్, కెవిపిఎస్ అధ్యక్షులు సురేష్, మాల మహాసేన నాయకులు దిలీప్, మురళీ, నాగేశ్వరావు పాల్గొన్నారు. అనంతరం ఉద్యమ కార్యాచరణ నిర్ణయించారు. ఈ నెల 21వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వినియోగంలోకి ఆక్సిజన్ ప్లాంట్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్ స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులకు వినియోగంలోకి వచ్చింది. ఇటీవల లాంచనంగా ఆక్సిజన్ ప్లాంట్‌ను ఎంఎల్‌ఎ ఎలిజా ప్రారంభించినప్పటికీ సాంకేతిక లోపాల వల్ల వినియోగంలోకి రాలేదు. ఈ లోపాలను సరిచేసి సిద్ధం చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చారు. కరోనా వైరస్ నాలుగో దశ వస్తుందనే ప్రచారంతో ముందస్తుగా ఆక్సిజన్ ప్లాంట్‌ను సిద్ధం చేశారు. నిమిషానికి వెయ్యి లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో ఈ ప్లాంట్ నిర్మించారు. ఏరియా ఆసుపత్రిలో వంద పడకలకు అవసరమైన ఆక్సిజన్‌ను పుష్కలంగా సరఫరా చేసే సామర్థ్యం కలిగి ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఆక్సిజన్ ప్లాంట్ నిర్వహణ కోసం అవసరమైన విద్యుత్ సదుపాయాన్ని కూడా అమర్చడం శుభపరిణామమని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో వంద పడకలకు అవసరమైన ఆక్సిజన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ వినియోగంలోకి రావడంతో ఆస్పత్రి వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయని తెలిపారు.



ఆక్సిజన్ ప్లాంట్



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

సిపిఎం ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - గణపవరం

యువకులు క్రీడారంగంపై ఆసక్తి కలిగి ఉండాలని టిడిపి బిసి సెల్ జిల్లా కార్యదర్శి యాళ్ల సుబ్బారావు, సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మల్లపురాజుపేటలో యువకులకు సిపిఎం ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. స్లో సైక్లింగ్, కళ్లకు గంతలు కట్టుకుని కుండ కొట్టడం, రన్నింగ్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జోగి సత్యనారాయణ, పట్నాల ఆంజనేయులు పాల్గొన్నారు.

21 నుంచి టిబిఆర్ ట్రోఫీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రతి సంవత్సరంలానే ఈ ఏడాది కూడా బుట్టాయగూడెం జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో టిబిఆర్ మెగా క్రీడా ఫెస్టివల్ ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టిబిఆర్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ క్రీడల్లో పోలవరం నియోజకవర్గంలో ఉన్న క్రీడాకారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ టిబిఆర్ ట్రోఫీలో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 21వ తేదీ లోపు కోడూరి ఆనంద్ 9491711636, 9640937766, 9666955977 సంప్రదించాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఉంగుటూరు



సమావేశమైన పూర్వ విద్యార్థులు

మండలంలోని నారాయణ పురం ఉషోదయ హైస్కూల్‌లో 2012-13లో పదో తరగతి చదివిన బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో సమావేశం అయ్యారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆ పాఠశాల కరస్పాండెంట్ గుణ్ణం బుల్లబ్బాయ్ గీతావాణి, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆనాటి విద్యార్థుల్లో పలువురు సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. దశాబ్దకాలం తరువాత ఒకేచోట కలుసుకోవడం సంతోషంగా ఉందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో తమ బ్యాచ్ పలు సేవా కార్యక్రమాలు చేస్తామని హామీ ఇచ్చారు.

వరుస చోరీలతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న వరుస చోరీలతో మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు భీతిల్లుతున్నారు. 15 రోజుల వ్యవధిలో మూడు చోరీలు జరగడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల మండలంలోని శ్రీహరిపురంలో ఓ హోటల్‌లో రెండు గ్యాస్ సిలిండర్లు, ముదినేపల్లిలోని కైకలూరు రోడ్డులో మూడు మంచినీటి బోర్ల హెడ్‌లు అపహరణకు గురయ్యాయి. మండలంలోని గురజ గ్రామ మసీదులో మధ్యాహ్న సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదు హుండీ పగులు కొట్టి అందులోని రూ.పదివేలు పైచిలుకు నగదును ఎత్తుకుపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రీతిగా మండలంలోని ఏదోచోట చోరీలు జరుగుతుండడంతో మండల ప్రజలు భయంభ్రాంతులకు గురవుతున్నారు. పండుగ సమయం కావడంతో వ్యవసపరులు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికే పోలీసులు చోరీలపై దృష్టి పెట్టి చోరీలు జరగకుండా అరికట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



హెడ్ లేని చేతిపంపు (ఫైల్)

3ఎఫ్ ఇండస్ట్రీస్‌లో మరో ఘోరం



బాయిలర్‌లో జారి మహిళా కూలీ మృతి
బంధువుల ఆందోళన
రూ.18లక్షల పరిహారం, అల్లుడికి ఉద్యోగం ఇచ్చేందుకు హామీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం/పెంటపాడు

పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీ(ఎఫ్ఎఫ్ఎఫ్)లో నెలరోజుల క్రితం (డిసెంబర్ 21న) జరిగిన అగ్నిప్రమాదంలో ఒకరు సజీవదహనమై, నలుగురు తీవ్రంగా గాయపడిన ఘటన మరువకముందే మరో ప్రమాదం భయభ్రాంతులకు గురిచేసింది. ఫ్యాక్టరీలోని బాయిలర్ కన్వేయర్‌లో జారి ఓ మహిళా కూలీ బుధవారం ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కృష్ణయ్యపాలేనికి చెందిన దేవెళ్ల వెంకటరమణ(55) 15 సంవత్సరాలగా ఫ్యాక్టరీలో రోజువారీ కూలీగా పనిచేస్తోంది. ఎప్పటిలాగానే ఉదయం ఫ్యాక్టరీలో పనికివెళ్లింది. బాయిలర్ కన్వేయర్ వద్ద ఊక వేస్తుండగా అందులోకి జారిపోయింది. ఈ ఘటనలో ఆమె శరీరం పూర్తిగా కాలిపోయి మృతిచెందింది. వెంకటరమణ భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. ఈమె ఇద్దరు కుమార్తెలకూ వివాహాలు జరిగాయి. చిన్నకుమార్తె భర్త ఇదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు.

ప్లాట్‌ఫారం లేకపోవడం వల్లే..

ఫ్యాక్టరీలో వెంకటరమణ పనిచేసే చోట ప్లాట్ ఫారం ఉండాలి. అది లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు చెబుతున్నారు. కార్మికుల పట్ల ఫ్యాక్టరీ యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

బంధువుల ఆందోళన

వెంకటరమణ కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం చేసేవరకూ ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్, రాంబాబు, వైసిపి నాయకులు వీర్ల గోవిందరావు, జి.సాంబయ్య మద్దతు తెలిపారు. ఈ ఆందోళనకుదిగొచ్చిన యాజమాన్యం కుటుంబ సభ్యులు, నాయకులతో చర్చలు జరిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.18 లక్షల నష్టపరిహారం, చిన్నల్లుడు వల్లూరి శ్రీనివాస్‌కు ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

భీమవరం : ఫుడ్ ఫ్యాట్స్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో జరిగిన ప్రమాదాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గత ప్రమాదాన్ని మరిచిపోకముందే మరో ప్రమాదం జరగడం, కార్మికురాలు మృతి చెందడం యాజమాన్యం వైఫల్యంగా భావించాలని స్పష్టం చేసింది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని, తక్షణం మృతి చెందిన కార్మికురాలి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. వరుస ప్రమాదాలు జరుగుతున్న యాజమాన్యం కానీ ప్రభుత్వం గానీ తగు చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. పరిశ్రమల్లో తనిఖీలు లేకపోవడం, సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం ప్రమాదాలకు కారణమని పేర్కొన్నారు. ఒకపక్క కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ మరోపక్క పరిశ్రమల నిర్వహణ, భద్రతా చర్యలు యాజమాన్యాలకు వదిలిపెట్టడం ప్రభుత్వాలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రభుత్వాలు తీసుకున్న ఈ వైఖరి కారణంగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఏనాడూ కార్మికులతో అధికారులు మాట్లాడింది లేదని, కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా అధికారులు అందుబాటులో లేకుండా ఉన్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రమాదాలకు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు పరిశ్రమల్లో అధికారులు తనిఖీలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పరిశ్రమలు, ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక సంఘాలతో జిల్లా స్థాయిలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, అన్ని పరిశ్రమల్లోనూ ఇఎస్ఐ, పిఎఫ్, కార్మిక చట్టాల అమలుకు జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరుస్పోర్ట్స్

వాహనదారులందరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ సూచించారు. 34వ రహదారి భద్రత వారోత్సవాలను ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఐపిఎస్ వారు వివిధ డిపార్ట్‌మెంట్‌లో వారితో కలిసి సమావేశం నిర్వహించారు. భద్రతా వారోత్సవాల్లో నిర్వహించాల్సిన విధి విధానాల గురించి, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఎస్‌పి వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో ఎక్కువగా యువత మృతి చెందుతున్నారన్నారు. వాహనదారులందరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని, రేస్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరమని చెప్పారు. పరిమితికి మించి ఆటోల్లో పాసింజర్లను ఎక్కించరాదని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. బడి బస్సు భద్రత భావితరాలకు భరోసా అని తెలుసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ విషయాలపై భద్రత వారోత్సవాల్లో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అధికారులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, కె.శ్రీహరి, కె.విజయరాజు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.ధనలక్ష్మి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎం.రాము, ఎఒ జివి.భాస్కరరావు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీసులు, అధికారులు

మట్టి అక్రమ తవ్వకాలు అడ్డగింత



మట్టి అక్రమ రవాణా చేసిన ప్రదేశం ఇదే..

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని రమణక్కపేట గ్రామంలోని ఎస్‌సి ఏరియాలోని మంచి నీళ్ల ట్యాంక్ రోడ్డు దగ్గరలో ఉన్న గుట్టపై అక్రమ మట్టి తవ్వకాలను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. పొక్లెయిన్ ద్వారా ట్రాక్టర్లలో లోడు చేసి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు అడ్డుకున్నారు. సబ్ డివిజన్ కలెక్టర్‌కి, తహశీల్దార్‌కి సమాచారం అందించారు.

రైలు ఢీకొని యుటిఎఫ్ నేత మృతి


ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రైలు ఢీకొని యుటిఎఫ్ నేత, రిటైర్డ్ ఉపాధ్యాయులు పెన్మత్స చిన్నసోమరాజు(68) బుధవారం ఉదయం మృతిచెందారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన చిన్నసోమరాజు ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అనంతరం గ్రామంలోని రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న తనపొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎప్పటిలాగానే ఉదయం పొలానికి వెళ్లిన ఆయన పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు.

1985లో రెగ్యులర్ ఉపాధ్యాయునిగా జిన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలలో తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. పాలకొల్లు, పెనుగొండ, పోడూరు మండలాల్లోని పాఠశాలల్లో పనిచేశారు. 2019లో శాసనసభ్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా అందుకున్నారు. టిసి సెంటర్ కార్యదర్శిగా, మండల రిసోర్స్‌పర్సన్‌గా తన విలువైన సేవలందించారు. చివరిగా జిన్నూరుపాలెం యుపి స్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా 2016లో ఉద్యోగ విరమణ చేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా విశేష సేవలందించారు. ఆ సమయంలో ఉపాధ్యాయ సమస్యలపై చేపట్టిన ఉద్యమాల్లో కీలకభూమిక పోషించారు.


సోమరాజు మృతికి ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సంతాపం తెలిపారు. ఆయన మరణం ఉపాధ్యాయ రంగానికి, విద్యార్థులకు తీరని లోటన్నారు.

ప్రముఖుల సంతాపం



చిన్నసోమరాజు(ఫైల్‌ఫోటో)

పనిపట్ల ఆయన అంకిత భావంతో పనిచేసేవారని కొనియాడారు. అనేక ఉద్యమాల్లో పాల్గొని ఎన్నో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించారన్నారు. పోడూరు, పెనుగొండ, పాలకొల్లు మండలాల్లో జరిగిన యుటిఎఫ్ కార్యక్రమాల్లో ప్రధాన భూమిక పోషించి, విస్తృత సేవలను అందించారన్నారు. సోమరాజు మృతి బాధాకరమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి అన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. యుటిఎఫ్ అభ్యున్నతికి విశేషమైన కృషి చేశారన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. సోమరాజు మృతి యుటిఎఫ్ ఉద్యమాలకు తీరని లోటు అని యుటిఎఫ్ జిల్లా నేత కె.రాజశేఖర్ అన్నారు. పోడూరు, పాలకొల్లు, పెనుగొండ మండలాల్లో యుటిఎఫ్ బలోపేతానికి సోమరాజు కృషి చేశారన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న పిహెచ్‌సి డాక్టర్ సంతోష్‌నాయుడు

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి – గణపవరం

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. గణపవరం-2,3 సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతిరోజు ఐరన్, క్యాల్షియం మాత్రలు వేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏ దాది వయస్సు ఉన్న పది మంది పిల్లలకు బిసిజి టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జి.విల్సన్‌బాబు పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి – భీమడోలు

మండల పరిధిలో గ్రామ పంచాయతీల నుంచి ఫిబ్రవరి నెలాఖరుకు ఇంటి పన్నులు, కుళాయి ఫీజులు నూరు శాతం వసూలు చేయాలని ఎంపిడిఒ రాఘవన్ ఆదేశించారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన భీమడోలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులను సకాలంలో వసూలు చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పన్నులను జనవరి నెలలో 50 శాతం, మిగిలినది ఫిబ్రవరి నెలలో వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులు, కుళాయి ఫీజుల వసూలు లక్ష్యాలు పూర్తి చేయని సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


దుస్తులు అందిస్తున్న మురళి

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

భీమడోలు :అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైసిపి గుండుగొలను గ్రామ సచివాలయం–1 సమన్వయకర్త గోటికల మురళి కోరారు. కార్యాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం కోడ్–23లో చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సదరు చిన్నారికి దుస్తులను మురళి అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త బి.రాజామణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్ర అభివృద్ధికి సహకరిస్తున్న మురళికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న ప్రాథమిక పూర్వ పాఠశాల నిర్వహణ, చిన్నారులకు అందిస్తున్న ఇతర సదుపాయాల గురించి తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు, కౌమర బాలికలకు ప్రత్యేకించిన వివిధ కార్యక్రమాల నిర్వహణ తీరును వివరించారు.

'వైసిపి బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి – కైకలూరు రూరల్

కైకలూరు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు, పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని వైసిపి ఎస్‌పి సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నోబుల్ కోరారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఇన్‌ఛార్జి లేళ్ల అప్పిరెడ్డిని ఆయన బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కైకలూరు నియోజకవర్గ సమస్యలు, పార్టీ పరిస్థితి గురించి వివరించినట్లు చెప్పారు.

నేరాలు – ఘోరాలు


వివరాలు తెలుపుతున్న ఎస్‌ఐ చంటిబాబు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి – ఆగిరిపల్లి

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న షేక్ నహీంబాషాను బుధవారవ ఆగిరిపల్లిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆగిరిపల్లి ఎస్‌ఐ ఎన్.చంటిబాబు తెలిపారు.


ఎడ్ల మృతదేహాలు

కాలువలో పడి రెండు ఎద్దులు మృతి

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

పొలం పనులకు వెళ్తున్న ఎడ్ల బండి కాలువలో పడిపోయి రెండు ఎడ్లు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్కవరం గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం లక్కవరం గ్రామానికి చెందిన బొప్పనేటి లక్ష్మీనారాయణ రైతుకు చెందిన ఎడ్ల బండిపై నారు తీసుకువెళ్లే సమయంలో ఎడ్లతో పాటు బండి కాలువలో పడిపోయింది. ఎడ్ల బండి లోతుగా ఉన్న గుండంలో మునిగిపోయింది. దీంతో బండికి కట్టి ఉన్న ఎడ్లు రెండు నీటిలో మునిగి మృతి చెందాయని రైతు లక్ష్మీనారాయణ వాపోయారు. వ్యవసాయ పనులకు ఆధారమైన ఎడ్లు రెండూ మృత్యువాత పడటంతో తీరని నష్టం వాటిల్లిందని బాధిత రైతు కంట తడి పెట్టుకున్నారు. ఈ సంఘటన స్థానికుల మనసులను కలచివేసింది.

నిందితుడికి ఎనిమిదేళ్ల జైలు

ప్రజాశక్తి – గణపవరం

మండలంలోని మొయ్యేరు గ్రామానికి చెందిన పొట్ల రాజుకు 8 ఏళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా తాడేపల్లిగూడెం కోర్టులో విధించారు. 2018లో రాజుపై 498 ఎ 306 సెక్షన్‌పై కేసు నమోదైంది. ఆ కేసు తాడేపల్లిగూడెం కోర్టులో బుధవారం విచారణ జరిగింది. విచారణలో రాజు చేసిన నేరం రుజువు కావడంతో ఎనిమిదేళ్ల జైలు, రూ.పది వేల జరిమానా విధించి జైలుకు తరలించారు.

లబ్ధిదారుల నిరీక్షణకు తెర

ఎట్టకేలకు ఇళ్ల స్థలాల మెరక పనులు ప్రారంభం



ఇళ్ల స్థలాల మెరక పనులు ప్రారంభిస్తున్న గుత్తేదారుడు

ప్రజాశక్తి – ఉంగుటూరు

నారాయణపురం గ్రామంలో ఇళ్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేరేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అధికారులు చెప్పారు. నారాయణపురంలో 206 మంది లబ్ధిదారులను గతంలోనే గుర్తించారు. వారందరికి ఇళ్ల స్థలాల కోసం నారాయణపురంలో ఎక్కడా స్థలాలు దొరకకపోవడం, దొరికిన స్థలం కోర్టు వివాదంలో ఉండటం తదితర కారణాలతో ఉంగుటూరు రెవెన్యూ గ్రామానికి చెందిన కొత్త ఉంగుటూరులో రెండు వేర్వేరు చోట్ల 5.69 ఎకరాలను రైతుల నుంచి 2020 మే నెలలో ప్రభుత్వం ఎకరం రూ.54 లక్షల వంతున కొనుగోలు చేసింది. 2021లో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి ప్రజాప్రతినిధులు అట్టహాసంగా లబ్ధిదారుల పేర్లను వెల్లడించారు. కాని అప్పటి నుంచి ఆయా స్థలాల్లో మెరక పనులు చేయలేదు. లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి వారితో గృహ నిర్మాణాలు ప్రారంభించాలనే ప్రభుత్వ ఆశయానికి జిల్లా కలెక్టర్ చొరవ తీసుకున్నారు. మొదటి లేఅవుట్ 2.78 ఎకరాల్లో సుమారు రెండు మీటర్ల ఎత్తున నల్ల మట్టితో పూడ్చేందుకు రూ.63 లక్షలు బెండర్లు ఎఎస్‌ఎస్‌కె సంస్థ గుత్తేదారులు దక్కించుకున్నారు. బుధవారం మెరక పనులను ప్రారంభించారు. ఉంగుటూరు – నాచుగుంట మధ్యలో ఉంగుటూరు పంచాయతీకి చెందిన మట్టిని తవ్వి ఇళ్ల స్థలాలను మెరక చేయిస్తున్నామని వారం పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని గుత్తేదారుడు తెలిపారు. ఇక రెండో లే అవుట్ 2.53 ఎకరాల్లో ప్రస్తుతం జామాయిలు చెట్లు ఉన్నాయి. వాటిని తొలగిస్తే కాని మెరక పనులు ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. రెండో లే అవుట్‌లో మెరక చేసేందుకు రూ.30 లక్షలు నిధులు సిద్ధంగా ఉన్నాయని, జామాయిలు చెట్లు తొలగింపు అంశం రెవెన్యూ శాఖ పరిధిలో ఉందని మండల హౌసింగ్ ఎఇ సురేష్ చెప్పారు. లెవెలింగ్ పనులు నారాయణపురం సచివాలయం–2 సెక్రటరీ సూరత్తుల దుర్గాధర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పులవర్తి లక్ష్మీకాంత్ పర్యవేక్షిస్తున్నారు. నారాయణపురం పేదలకు ఇళ్ల స్థలాలు పూడిక అనంతరం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తిచేసేలా లబ్ధిదారులను చైతన్యపరుస్తామని ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేశారు.

విద్యుత్ ఉద్యోగులపై దాడులు చేస్తే సహించం

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శశిధర్

ప్రజాశక్తి – దెందులూరు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 24 గంటలు వినియోగదారులకు సేవలు అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులపై ఎవరైనా దాడులు చేస్తే సహించేది లేదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శశిధర్ అన్నారు. దెందులూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని దోసపాడు గ్రామంలో కడిమే సాయి గడువు తేదీలోపు కరెంట్ బిల్లు కట్టలేదని, బిల్లులు చెల్లించాలని పదేపదే చెబుతున్నా లైన్ మెన్ బొల్లే సుధాకర్‌పై మంగళవారం సాయంత్రం దాడి చేసి తీవ్రంగా


ఎఫ్‌ఐఆర్ ప్రతిని చూపిస్తున్న ఇఇ శశిధర్

గాయపరిచారని చెప్పారు. ఈ నేపథ్యంలో దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశామని, కేసు నమోదు చేసి అతనిని అరెస్టు చేశారని తెలిపారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది అహర్నిశలు పని చేస్తున్నారని, అటువంటి వారిపై ఇలాంటి దాడులు జరగటం చాలా బాధాకరమని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇలు ఒంకార్, భీమేశ్వరరావు, ఎఇ రమేష్ పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు

ప్రజాశక్తి – ముదినేపల్లి

పొగమంచు, చలి తీవ్రతతో మండల ప్రజలు గజగజలాడుతున్నారు. వారం రోజులుగా చలి తీవ్రత అధికంగా ఉంది. దీంతో ప్రజలు బయటకు అడుగుపెట్టలంటేనే భయపడుతున్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న చలి తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బుధవారం మండలంలో అనేక గ్రామాల్లో పొగమంచు దట్టంగా అలుముకుపోయింది. ముదినేపల్లి సెంటర్‌లో పొగమంచు కారణంగా వాహనదారులకు దారి కనిపించక నానా ఇబ్బందులు పడ్డారు. వాహనాలను నెమ్మదిగా పోనిస్తూ రాకపోకలు సాగించారు. ఉదయం ఎనిమిది గంటలైనా మంచు తెరలు వీడకపోవడంతో రోడ్డు కనిపించక వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు శీతల గాలులు కూడా వీస్తుండడంతో ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. మంచుపొగతో పాటు చలి విపరీతంగా ఉండడంతో వృద్ధులు, పిల్లలు, అన్ని



కమ్ముకున్న పొగమంచు

వయస్సుల ప్రజలు చలిపులితో అసౌకర్యానికి గురయ్యారు.

చిరస్మరణీయులు ఎన్‌టిఆర్

ప్రజాశక్తి – భీమడోలు

ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాల వేసి టిడిపి కార్యకర్తలు నివాళులర్పించారు. టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు భీమడోలులోని పంచాయతీ కార్యాలయం సమీపంలో, సంతపేట, వడ్లపట్ల గ్రామాల్లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాల వద్ద నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టిడిపి ఎస్‌సి సెల్ భీమడోలు శాఖ అధ్యక్షులు రాచప్రోలు రాజకపూర్ సౌజన్యంతో పేదలకు దుస్తులను గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు.



భీమడోలులో...

గణపవరం : టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వర్ధంతిని టిడిపి ఆధ్వర్యంలో కొత్తపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన పోవాలని సైకిల్ పాలన రావాలని అన్నారు. ప్రజల సొమ్ముతో వాలంటీర్లకు జీతాలు ఇస్తూ వైసిపి కార్యక్రమాల్లో వాడుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల సభలు, సమావేశాలు, ఆందోళనలు నిర్వహించకుండా ఎందుకు జిఒ ఒకటి జారీ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు ఇందుకూరు కృష్ణంరాజు, ఏళ్ల సుబ్బారావు, షేక్ మీరా, కోనసాని నాగేశ్వరరావు, కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దెందులూరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు అని పలువురు టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని దెందులూరు, పోతునూరు, కొవ్వలి, రామారావుగూడెం, తదితర ప్రాంతాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతిని స్థానిక టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని శ్రీనివాసపురంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత ఎన్‌టిఆర్‌కు దక్కుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు పాల్గొన్నారు. మండలంలోని గురవాయిగూడెం టిడిపి కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు కుక్కల మాధవరావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : ఎన్‌టిఆర్ వర్ధంతిని టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని మక్కినవారిగూడేంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ రంగంలో పెనుమార్పులు సృష్టించి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి బడుగు బలహీన, అణగారిన వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత ఎన్‌టిఆర్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నా యుడు రా మకృష్ణారావు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జ య్యవరపు శ్రీ రామమూర్తి, జెడ్‌పిటిసి మా జీ సభ్యులు నల్లూరి చలపతిరావు, బిసి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, సొసైటి మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, అచంట సూ ర్యనారాయణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అచంట అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


టి.నరసాపురంలో..

కైకలూరు రూరల్ : కైకలూరు పట్టణ అధ్యక్షులు ఎండి జాని ఆధ్వర్యంలో పట్టణంలో తాలూఖా సెంటర్, కోరుకొల్లు రోడ్డులో ఎన్‌టిఆర్ విగ్రహాలకి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు, కొల్లి గంగారామ్, మండలపు ధర్మరాజు, దేవినేని ఢలరామ్, పాకనాటి సీతారామ్, పాకనాటి వీరాంజనేయులు, సూర్యదేవర శ్రీనివాసరావు, మోహనరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, నరసింహరావు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న టిడిపి కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక అందించారు. టిడిపి పేద కార్యకర్తల పిల్లల చదువుల నిమిత్తం సంవత్సరానికి రూ.12 వేలు ఇంటర్ చదివేవరకు అందిస్తానని చెప్పారు. ఈ మేరకు ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి చేతులమీదుగా ఆర్థిక సాయం అందించారు. అనంతరం పేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు రాజారెడ్డి, మానేపల్లి రాజారావు, కె.తిరుపతిరావు, మహలక్ష్ముడు వీరాస్వామి, బుద్దాల నాగు, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ వర్ధంతి సభలో టిడిపి నూజివీడు నియోజకవర్గ నాయకులు పర్వతనేని గంగాధర్ పాల్గొన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షులు గడ్డం ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, మండల అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరరావు (చిట్టి బాబు), ఉపాధ్యక్షులు తోటకూర వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిపి కందుల కృష్ణ, మండల నాయకులు, కార్యకర్తలు, అ భిమానులు పా ల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో స్థానిక వైకుడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని అల్లూరు, గురజ, పెదపాలపర్రు, వైవాక తదితర గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, నాయకులు యర్రా రాంబాబు, దావు నాగరాజు, దాకారం సర్పంచి జాస్తి రాఘవేంద్రరావు, ఆరట్ల నాగరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం కొమ్ముగూడెం కూడలిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో రోగులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, ఏలూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యాద్రప్రగాఢ శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, నియోజకవర్గ ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, ఏలూరు అధికార ప్రతినిధి జారం చాందిని, రాము, గుండిబోయిన. మురళి, వంక కృష్ణరాజు, మండల ఎస్‌టి సెల్ అధ్యక్షులు కోర్స వెంకటేశ్వరరావు, మండపాటి మోజెష్, కేరం వెంకటేశ్వరావు,


ముసునూరులో...

దువ్వుల సంకురుడు, పద్మరాజు, మద్దిపాటి శ్రీను, నాగరాజు, మొడియం సూర్యచంద్ర పాల్గొన్నారు.

నూజివీడు : మండలంలోని రావిచర్ల సెంటర్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కాపా శ్రీనివాసరావు మాట్లాడారు. సమావేశానికి విచ్చేసిన అభిమానులకు, కార్యకర్తలకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచి అక్కినేని చందు, ఎంపిటిసి మాజీ సభ్యులు వి.సాంబశివరావు, టిడిపి నాయకులు లావు ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి మెయిన్ సెంటర్ వద్ద ఉన్న టిడిపి స్థూపం వద్ద ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎం.కోటేశ్వరరావు, పి.నరసింహరావు, లక్ష్మీవిక్టర్‌బాబు, ఎం.సత్యకుమార్, శ్రావణ్‌కుమార్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

జల్లి కాకినాడ మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి – గణపవరం

జల్లి కాకినాడ మాజీ సర్పంచి ఇందుకూరి జానకి రామరాజు (80) బుధవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. జానకి రామరాజు 1976లో గ్రామానికి సర్పంచిగా పని చేశారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఇందుకూరి అశోక చక్రవర్తి వర్మ బిజెపి నాయకుడిగా కొనసాగుతున్నారు. జానకిరామరాజు మృతికి జల్లి కాకినాడ సిపిఎం శాఖ బుధవారం సంతాపం తెలిపింది.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి – ముదినేపల్లి

ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం పది గంటలకు ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పి.మల్లీశ్వరి బుధవారం తెలిపారు. ఈ ప్రజావేదిక కార్యక్రమంలో గత నెల 28 నుంచి ఈనెల 12వ తేదీ వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

భోగేశ్వరుని హుండీ ఆదాయం రూ.6.35 లక్షలు

ప్రజాశక్తి – కలిదిండి

స్థానిక పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.6,35,833 వచ్చినట్లు ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గుడివాడ దేవాదాయ శాఖ తనిఖీదారు వి.సుధాకర్ సమక్షంలో హుండీ తెరిచి లెక్కింపు చేపట్టామన్నారు. గత పది నెలల కాల పరిమితిలో భక్తుల కానుకల ద్వారా వచ్చిన ఆదాయమన్నారు. ఆలయ ధర్మకర్తలు చిట్టూరి బుజ్జి, చెరుకువాడ బలరామరాజు, కూచింపూడి సుబ్బలక్ష్మి, బోళ్ల లక్ష్మీకుమారి, కొల్లాటి కనకదుర్గ, అర్చక స్వామి, ఐలూరి శ్రీకృష్ణ, కలిదిండి మహిళా కోలాట సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.